సాక్షి నిజామాబాద్

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



జిల్లా కేంద్రంలోని నామ్‌దేవ్‌వాడ సాయిబాబా ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబురం షురూ

జిల్లాలో బతుకమ్మ సంబురాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పూల సంబురాల్లో భాగంగా ఆడ బిడ్డలు తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో ఆడిపాడారు. ఆలయాల పరిసరాలు, కూడళ్లు కళకళలాడాయి. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబురాలు కొనసాగనున్నాయి. – నిజామాబాద్ రూరల్

న్యూస్‌రీల్

కదిలొచ్చిన అమ్మ..



సుభాష్‌నగర్: దుర్గాదేవి శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలోని ఇంద్రప్రియదర్శిని కాలనీ వాసులు దుర్గామాత ఆగమనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ప్రజలందరూ కలిసిమెలసి నవరాత్రులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జీఎస్టీని తగ్గించి నరేంద్రమోదీ దేశ ప్రజలకు దసరా, దీపావళి బహుమతి అందజేశారన్నారు. మాజీ కార్పొరేటర్ నిచ్చెంగ్ లతాకృష్ణ, ఆనంద్, పవన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక




కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మిసిమి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న డి అక్షిత్, ఎల్ రేవంత్ జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా జట్టు తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు విశాఖపట్టణంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారన్నారు. ఆదివారం విద్యార్థులతోపాటు, పీఈటీ సంజీవ్‌ను సన్మానించారు.

నేటి నుంచి టీపీటీఎఫ్ అధ్యయన తరగతులు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో ఈనెల 22, 23వ తేదీలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర స్థాయి అధ్యయన తరగతులు నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లింగం ఒక ప్రకటనలో తెలిపారు. పాత రాజంపేట్ రైల్వే గేట్ వద్దనున్న లేపాక్షి హోమ్స్ కమ్యూనిటీ హాల్‌లో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొంటారని తెలిపారు

కాలేయం జాగ్రత్త

చాపకింద నీరులా విస్తరిస్తున్న హెపటైటీస్ బీ, సీ



శరీరంలో ప్రధానమైన కాలేయం పనితీరును హెపటైటీస్ దెబ్బకొడుతోంది. చాపకింద నీరులా విస్తరిస్తున్న వైరస్ ప్రాణాల మీదికి వచ్చేంత వరకు బయటపడడం లేదు. హెపటైటీస్ బీ, సీ బాధితుల సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. వైరస్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతోపాటు అప్రమత్తం చేసేందుకు వైద్యారోగ్యశాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే ప్రతి రోగికి స్క్రీనింగ్ చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సోమవారం జిల్లాలోని ప్రైవేట్ వైద్యులు, వైద్యారోగ్యశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది.

- అవగాహన, జాగ్రత్తలు అత్యవసరం
- నేడు ప్రైవేట్ వైద్యులు, అధికారులతో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక సమావేశం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో హెపటైటీస్ చాపకింద నీరులా విస్తరిస్తోంది! ఏ, బి, సీ, డీ, ఈ ఐదు రకాల వైరస్‌లలో బీ, సీ రకాలు ప్రమాదకరం. హె పటైటీస్ బీ ని టీకాల ద్వారా నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ 'సీ' బారిన పడిన వారు కోలుకోవడం కష్టమే. హెపటైటీస్ ఏ, డీ, ఈ అనే వైరస్ కేవలం కలుషితమైన ఆహారం, నీరు కారణంగా వస్తుంది. చాలా మంది ఈ మూడు వైరస్‌ల బారిన పడుతున్నప్పటికీ కోలుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు.

డేంజర్ 'సీ'

హెపటైటీస్ సీ బారిన పడిన వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనంటున్నారు వైద్యాధికారులు. కాలేయ వాపు, మచ్చలు, చివరకు కాలేయ క్యాన్సర్‌కు దారి తీస్తుందంటున్నారు. 'సీ' వైరస్ సోకడానికి ప్రధాన కారణంగా అప్పటికే వైరస్ సోకిన వారితో లైంగిక సంబంధాలు, అనారోగ్యకర సూదుల వినియోగం, రక్తమార్పిడి, సురక్షితం కాని శృంగారం కారణమవుతుంది.

హెపటైటీస్ 'బీ'కి అందుబాటులో టీకాలు

స్క్రీనింగ్ ద్వారా హెపటైటీస్ బీ బారిన పడింది లేనిదీ తెలుసుకోవచ్చు. హెపటైటీస్ చాపకింద నీరులా విస్తరిస్తున్న నేపథ్యంలో అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ.. హై రిస్క్‌లో వైద్య సేవలందించే స్టాఫ్ నర్సులకు ఇప్పటికే టీకాలు ఇచ్చింది. ఈ టీకాలు మూడు దఫాలుగా తీసుకోవాల్సి ఉంటుంది. మొదటి టీకా తీసుకున్న నెల రోజులకు మరో డోసు, మళ్లీ 6 నెలలకు చివరి డోసు తీసుకోవాల్సి ఉంటుంది. జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న 200 మందికిపైగా స్టాఫ్ నర్సులకు హెపటైటీస్ బి రాకుండా ఉండేందుకు వారం రోజులక్రితం మొదటి డోసు టీకాలు ఇచ్చారు.

జిల్లాలో బాధితులు..

జిల్లాలో హెపటైటీస్ బీ బారినన పడిన వారు 140 మంది, హెపటైటీస్ సీ బారిన పడిన వారు 60 మందికిపైగా ఉన్నారు. బీ, సీ రకాల వైరస్‌లు అత్యంత ప్రమాదకరమైనవి. రెండు రకాల వైరస్‌లు వివిధ రకాలుగా వ్యాపిస్తాయి. ట్రాన్స్‌జెండర్లు, డ్రగ్స్ తీసుకునేవారు, సెక్స్ వర్కర్లు ఎక్కువగా బాధితులుగా ఉంటారు. అలాగే తల్లికి ఉంటే పుట్టబోయే బిడ్డకు, సెలూన్‌లలో బ్లేడ్లతో, సింగిల్ యూజ్ సిరింజీలు, రక్తాన్ని పరీక్షించే సూదుల కారణంగా, టాటూ వేయించుకునే వారికి, డయాలాసిస్ రోగులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. స్త్రీ, పురుష బేధం లేకుండా ఒకరికి ఉంటే సెక్స్ ద్వారా మరొకరికి వ్యాపిస్తుంది. రక్షణ లేని లైంగిక సంపర్కంతో వైరస్ ముప్పు ఉంటుంది.

త్వరలో జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

హెపటైటీస్ బీ, సీ బాధితులకు చికిత్స అందించేందుకు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని వైద్యశాఖాధికారులు ఇప్పటికే ప్రణాళికలు రచిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వజనరల్ ఆస్పత్రి(జీజీహెచ్‌లో) వార్డు కేటాయించనున్నారు. ఈ మేరకు సోమవారం ప్రత్యేకంగా జీజీహెచ్ సూపరింటెండెంట్, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు సమావేశం కానున్నారు.

అవగాహన కల్పించేందుకు చర్యలు



హెపటైటీస్ ఏ, బీ, సీ, డీ, ఈ అనే వైరస్‌పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లోని ప్రజలకు హెపటైటీస్‌పై అవగాహన కల్పిస్తాం. మా సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి మరీ చైతన్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

– తుకారాం రాథోడ్, జిల్లా నోడల్ అధికారి

వివరాలు తీసుకుంటున్నాం



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో హెపటైటీస్ ఏ, బీ, సీ, డీ, ఈ వైరస్ బాధితుల వివరాలు తీసుకుంటున్నాం. ఇందు భాగంగానే సోమవారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి స్క్రీనింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా బి, సీ వైరస్‌పై అవగాహన ఉండాలి. జీజీహెచ్‌లో రోగులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

ఠంచన్‌గా బడికి..

- సమయానికి బడులకు చేరుకుంటున్న ఉపాధ్యాయులు
- పెరిగిన ఉపాధ్యాయుల హాజరుశాతం
- సత్ఫలితాలనిస్తోన్న ఫేస్ రికగ్నిషన్ బేస్డ్ అటెన్‌డెన్స్



ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల ముఖ హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 1 నుంచి ప్రారంభించిన ఉపాధ్యాయల ఆన్‌లైన్ హాజరు సత్ఫలితాలనిస్తోంది. డీఆర్‌సీ-ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ బేస్డ్ అటెన్‌డెన్స్) యాప్ అమలులోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరుశాతం పెరిగింది. ఉపాధ్యాయులు సమయానికి వస్తుండడంతో విద్యార్థులకు అభ్యసన ప్రయోజనం కలుగుతోంది. అయితే విద్యార్థులకు అమలు చేస్తున్న ముఖ హాజరు అంతంత మాత్రంగానే ఉంది. ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోవడం, యూడైస్ మాడ్యుల్‌లోని విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలోకి తీసుకరావడానికి ప్రయత్నం చేసినా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు పట్టించుకోకపోవడం, యాప్‌లో కొన్ని లోపాల కారణంగా విద్యార్థుల హాజరు నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది.

ఆగడాలకు చెక్

ఎఫ్ఆర్ఎస్ విధానం అమలులోకి రాక ముందు చాలా మంది ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయానికి వచ్చేవారు కాదు. అలాగే కొందరు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులు డుమ్మాలు కొట్టడం, మరికొందరు రియల్ ఎస్టేట్, ఇతర ఫైనాన్స్‌లు నడిపిస్తూ పాఠశాల ముఖం అప్పుడప్పుడు చూసేవారు. ఎఫ్ఆర్ఎస్ అమలులోకి వచ్చిన తరువాత ఈ నెల 4వ తేదీన 94.7 శాతం మంది ఉపాధ్యాయులు సమయానికి బడికి వెళ్లారు. ఈ విద్యా సంవత్సరం బడిబాట విజయవంతం కావడంతో గతేడాదితో పోలిస్తే అధికంగా దాదాపుగా 3వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు.

ఈ పాఠశాలల్లో తక్కువ..

ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ జిల్లాకు ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లాలో సాలూర మండలంలో పెంటాకుర్దు కాంప్లెక్స్ పాఠశాల, ఆర్మూర్ మండలంలోని ఆర్మూర్, పెర్కిట్ పాఠశాల సముదాయాలు, మెండోరా మండలంలో పోచంపాడ్ కాంప్లెక్స్, మోపాల్ మండలంలోలు బోర్గాం (పి) పాఠశాల సముదాయం విద్యార్థుల ముఖహాజరులో చాలా వెనుకబడి ఉన్నాయి. ఆయా కాంప్లెక్స్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 50 శాతం కూడా దాటలేదు. అలాగే జిల్లాలో ధర్పల్లి మండలం లోని హోన్నాజిపేట్ కాంప్లెక్స్ పాఠశాల 90శాతం విద్యార్థుల ముఖహాజరు నమోదుతో ప్రథమస్థానంలో ఉంది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ప్రైవేట్ యాజమాన్యాలు బదిలీ చేయకపోవడం కూడా హాజరు శాతం తక్కువ నమోదుకు కారణమని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	1,162
ఉపాధ్యాయులు	6,466,
విద్యార్థులు	1,01,144


విద్యార్థుల హాజరు తగ్గడానికి కారణాలెన్నో..

ఎఫ్ఆర్ఎస్ (ముఖ హాజరు) అమలుతో ఓ వైపు ఉపాధ్యాయుల హాజరు పెరిగినప్పటికీ విద్యార్థుల హాజరు అంతంతమాత్రంగానే ఉంటోంది. ప్రతిరోజూ వివిధ కారణాలతో 10 నుంచి 20 శాతం మంది విద్యార్థులు బడికి రావడం లేదు. అలాగే వచ్చిన విద్యార్థులకు సంబంధించి ముఖ హాజరు నమోదులో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాప్‌లో లోపాల కారణం ముఖహాజరు రావడం లేదు. అలాగే ముఖ హాజరుకే ఎక్కువ సమయం నెట్ డాటా వృథాకావడంతో ఉపాధ్యాయుల దీనిపై తగిన ఆసక్తి చూపడం లేదు. కొన్ని మారుమూల గ్రామాల్లో సిగ్నల్ సమస్య తీవ్రంగా ఉంటోంది.

తగ్గుతూ పెరుగుతున్న వరద

- ఎగువ నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- 34 గేట్ల ద్వారా లక్షా 28వేల క్యూసెక్కుల నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుతూ పెరుగుతోంది. ఆదివారం ఉదయం 89 వేల క్యూసెక్కులకు తగ్గిన ఇన్‌ఫ్లో గంట తరువాత లక్షా 16 వేలకు పెరిగి మళ్లీ 96 వేల క్యూసెక్కులకు తగ్గింది. తరువాత గంటకు లక్షా 28 వేల క్యూసెక్కులకు పెరిగింది. తరువాత మళ్లీ లక్షా 16 వేల క్యూసెక్కులకు తగ్గి మళ్లీ లక్షా 44 వేల క్యూసెక్కులకు పెరిగి సాయంత్రం వరకు నిలకడగా కొనసాగింది. ఇన్‌ఫ్లో తగ్గుతూ పెరుగుతుండడంతో అవుట్‌ఫ్లోను సైతం అదే విధంగా కొనసాగించారు. 34 గేట్ల ద్వారా గోదావరిలోకి లక్షా 28 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, సరస్వతి కాలువ ద్వారా 400, లక్ష్మి కాలువ ద్వారా 200, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తుండగా ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.



వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

చూడు.. ఒక వైపే

- సాంకేతిక పరిజ్ఞానానికి రెండు కోణాలు
- మనం ఎలా ఉపయోగిస్తే అలాంటి ఫలితాలు


■ స్మార్ట్ ఫోన్‌లో క్లాసులు విని నిజామాబాద్ నగరంలోని నామ్‌దేవ్‌వాడకు చెందిన ఓ విద్యార్థిని రెండేళ్ల క్రితం నీట్ ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోంది.

■ బీటెక్ పూర్తి చేసిన నిజామాబాద్ నగరానికి చెందిన ఓ యువకుడు చేతిలోని ఫోన్‌ను వాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆలవాటు పడ్డాడు. అప్పులపాలై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి గాయాలతో బయటపడ్డాడు.

ఖలీల్‌వాడి: మానవ మనుగడ, అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం(టెక్నాలజీ) పాత్ర కీలకంగా మారింది. మనం ఉన్నచోటి నుంచి సప్తసముద్రాల అవతల ఉన్న వ్యక్తి ఏం చేస్తున్నాడో.. ఎటు వెళ్తున్నాడో నేరుగా చూడగలుగుతున్నాం. ఏఐ టెక్నాలజీలో మనిషి అవసరం లేకుండా పని చేసే పరిస్థితి వచ్చింది. ఆన్‌లైన్‌లో సబ్జెక్ట్ నేర్చుకుంటూ ఉన్నత విద్యను అందిపుచ్చుకుంటున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు. మన అరచేతిలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం అనే నాణేనికి మరో వైపు చూసే వారి జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. బంగారు భవిష్యత్ నాశనమవుతోంది. అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని 'చూడు.. ఒక వైపే' అనే పరిస్థితి ఉంది. మనం ఏది చేస్తే అదే.. ఏది కోరుకుంటే అదే.. సాంకేతికతకు ఒకవైపే ఉందామా. రెండో వైపునకు వెళ్లి దారి తప్పుదామా అంతా మన చేతుల్లోనే ఉంది.

మంచికి ఉపయోగిస్తే మంచి ఫలితాలు

నేడు ఏ రంగంలో రాణించాలన్నా సాంకేతికతను ఉపయోగించాల్సిందే. ఏ సమాచారం కావాలన్నా మనకు ఇంటర్నెట్‌లో పుష్కలంగా లభిస్తుంది. పాఠ్యాంశాలు, విశ్లేషణలు, గణిత సమస్యల పరిష్కారం, కళలు, చిత్రాలు ఇలా ఏదిపడితే అది మన ముందుకు వస్తుంది. వీటిని విద్యార్థులు ఉపయోగించుకోవచ్చు. ఏ అంశంపైనైనా నిపుణుల సలహాలు, సూచనలు లభిస్తాయి. అలాగే వ్యాపారంలో మెలకువలు, వ్యాపారం ఎలా చేసుకోవాలి, ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశాలూ ఉంటాయి. దీంతో పాటు వ్యవసాయం, చదువు, ఉద్యోగం, ఏదైనా ఉపాధి రంగాల్లో మనకు అవసరమైన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సాంకేతికత సహాయంతో ప్రాజెక్టులను తయారు చేసి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. కేసుల దర్యాప్తు, చోరీల నివారణకు పోలీసులు సాంకేతికను వినియోగించుకుంటున్నారు. పోలీసులు లోకేషన్ ట్రాక్ చేసి నిందితులను అరెస్ట్ చేసిన ఘటనలూ ఉన్నాయి.



చెడుకు ఉపయోగించొద్దు

సాంకేతికతను చెడుకు ఉపయోగిస్తే కష్టాలు తప్పవు. ప్రస్తుతం ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. దీనిని మంచికి ఉపయోగించుకుంటే అనేక ప్రయోజనాలుంటాయి. చాలా మంది నేరాలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డ దారిలో డబ్బు సంపాదించడానికి ఉపయోగిస్తున్నారు. చెడుకు ఉపయోగిస్తే చట్టం తనపని తాను చేస్తుంది.

– వెంకటేశ్వర్‌రావు, ఏసీపీ, సైబర్ క్రైం, నిజామాబాద్

క్లుప్తంగా

వర్క్ ఇన్‌స్పెక్టర్ విధుల డుమ్మాపై విచారణ

నిజామాబాద్‌అర్బన్: ఇరిగేషన్ శాఖలోని ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. మాక్లూర్ మండలంలో పనిచేసే ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ జిల్లా కేంద్రంలో మీ–సేవా కేంద్రం నిర్వహిస్తున్నాడు. దీంతో కొన్నిరోజులుగా అతడు విధులకు డుమ్మా కొడుతున్నాడు. ఈక్రమంలో స్థానికులు అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అధికారులు ఇటీవల విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు పంపించారు.

కారేగాం తండావాసికి డాక్టరేట్



నిజామాబాద్‌అర్బన్: చందూరు మండలం కారేగాం తండాకు చెందిన రామావత్ లాల్‌సింగ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. లాల్‌సింగ్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రెండు డిగ్రీలు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మాస్టర్ లైబ్రరీ సైన్స్ పూర్తి చేశారు. 'భారతదేశ స్వాతంత్య్రం అనంతరం దేశంలోని సంస్కృతి, సంప్రదాయాల మధ్య జరుగుతున్న ఘర్షణలపై' పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో సమకాలిన్ హిందీ ఉపన్యాసం మే ఏ సాంప్రదాయక సంఘర్ష అనే అంశంపై ఆయన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. లాల్‌సింగ్ పరిశోధనపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రొఫెసర్లు పరిశోధకులు డాక్టరేటును అందించారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి




నిజామాబాద్ రూరల్: దేవీ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ సూచించారు. నగరంలోని కేసీఆర్ కాలనీలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాల మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు ఫ్రీగా ఉన్నప్పటికి విద్యుత్ అధికారులను సంప్రదించి కనెక్షన్లు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మండపాల వద్ద రాత్రి ఇద్దరు వ్యక్తులు ఉండాలని, డీజే సౌండ్‌సిస్టమ్‌లను నిషేధించినట్లు తెలిపారు. నిమజ్జన సమయంలో దేవీమాతలను త్వరగా నిమజ్జనానికి తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ సురేశ్‌కుమార్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ పూజకు వేళాయే..



గాజులపేటకు తరలివెళుతున్న దుర్గామాత విగ్రహాలు



వివేకానంద కాలనీలో ఏర్పాటుచేసిన మండపం

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- జిల్లావ్యాప్తంగా సిద్ధమైన మండపాలు

నిజామాబాద్ రూరల్: అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో దేవి మండపాలను అందంగా ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాల్లో పదకొండు రోజులపాటు అమ్మవారు పదకొండు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారిని భక్తులు పూజించి, నైవేద్యాలు సమర్పిస్తారు. అలాగే మండపాల నిర్వాహకులు సైతం అమ్మవారి దీక్ష చేపట్టి, 11 రోజులు నిష్ఠతో పూజలు నిర్వహిస్తారు.

భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నాం



గత 19 సంవత్సరాల నుంచి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నాం. కోరిన కోరికలు తీరస్తు అమ్మవారు ప్రతి ఏటా గాజులపేటలో కొలువుదీరుతుంది. పదకొండు రోజుల పాటు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహిస్తాం.

–బొడాగిరి సుధీర్, గాజులపేట

ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు..



దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత పదకొండు రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది. ప్రతిరోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించనున్నారు. అలాగే మండపాల్లో అన్నదానాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నిర్వహిస్తారు.

–సురేష్, గాజులపేట

తేదీ రోజు	అవతారం	వస్త్రం	ప్రసాదం
22.9.25	శ్రీస్వర్ణకవచాలంకృత దుర్గాదేవి	బంగారు రంగు	చలిమిడి, వడపప్పు,కట్టిపొంగలి
23.9.25	బాలా త్రిపురసుందరీ దేవి	లేత గులాబీ	తీపి బూందీ, శనగలు, చింతపండు పులిహోర
24.9.25	గాయత్రిదేవి	కాషాయం	రవ్వకేసరి, పులిహోర
25.9.25	అన్నపూర్ణాదేవి	పసుపు/గంధం	పొంగలి
26.9.25	లలితా త్రిపురసుందరి దేవి	బంగారు రంగు	పులిహోర, పెసర బూరెలు
27.9.25	కాత్యాయనిదేవి	ఎరుపురంగు	పులిహోర, పాయసం
28.9.25	మహాలక్ష్మీదేవి	గులాబీ రంగు	క్షీరాన్నం, దద్ధోజనం
29.9.25	సరస్వతిదేవి	తెలుపురంగు	అటుకులు బెల్లం, కొబ్బరి అన్నం
30.9.25	దుర్గాదేవి	ఎరుపు రంగు	అల్లం గారెలు, నిమ్మరసం, శనగలు
1.10.25	మహిషాసుర మర్ధిని దేవి	గోధుమ/ఎరుపు	చక్కెర పొంగలి, పానకం, వడపప్పు
2.10.25	రాజరాజేశ్వరీ దేవి	ఆకుపచ్చరంగు	పులిహోర, గారెలు, పరమాన్నం

104 సిబ్బంది సర్దుబాటు

- డీఈ ఆపరేటర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ స్టాఫ్ కామారెడ్డి మెడికల్ కళాశాలకు బదిలీ
- ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ల బదిలీలకు తాత్కాలిక బ్రేక్



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలో సంచార వైద్య సేవలు అందించే 104 వాహన సిబ్బందికి బదిలీలు చేయనున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా జిల్లాలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 35మంది ఉద్యోగులను కామారెడ్డి జిల్లాకు కేటాయించనున్నట్లు తెలిసింది. ఆదేశాలు నేడో.. రేపో రానున్నాయి. ఇప్పటికే కామారెడ్డి మెడికల్ కళాశాలకు డీఎంఈ నుంచి మెయిల్ వచ్చినట్లు సమాచారం. సొంత జిల్లాలో బదిలీ చేయకుండా పక్క జిల్లాకు బదిలీ చేయనుండటంతో జిల్లాలో పని చేస్తున్న 104 ఉద్యోగులు నేడు డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ హెల్త్)ను కలవడానికి వెళ్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 84 మంది ఉద్యోగులు

2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు ఇంటివద్దనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో 104 పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు 104 వాహనాలు 12 కేటాయించారు. ప్రతి వాహనంలో ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నిషిన్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్ ఉండేవారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 84 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిన సిబ్బంది ఈ విభాగంలో పనిచేస్తున్నారు. 2022లో 104 సేవలను అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. ఈక్రమంలో సిబ్బందిని ఇతర విభాగాల్లో సర్దుబాటు చేస్తుండగా డాటా ఎంట్రి ఆపరేటర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులను కామారెడ్డి జిల్లాకు బదిలీ చేయనున్నారు. తక్కువ జీతాలతో ఏళ్ల తరబడిగా విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులను ఉన్న ఫలంగా ఇతర జిల్లాకు కేటాయించడంపై వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ, జీజీహెచ్ పరిధిలో ఎక్కడ ఖాళీలు లేవని చెప్పడంతో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉన్నందున 35 మంది (డాటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీగార్డులు) అక్కడికి వెళ్లి విధులు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయని కన్నీరుపెట్టుకుంటున్నారు. ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్‌ల బదిలీకి మాత్రం తాత్కాలికంగా పెండింగ్ పడింది. ఈ రెండు కేటగిరీలు వైద్యారోగ్యశాఖ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో కోటా ఇచ్చినందున ప్రభుత్వ ఉద్యోగులు వచ్చే అవకాశం ఉంది. అందుకే రిక్రూట్‌మెంట్ పూర్తయిన తర్వాతా మిగిలి ఉంటే బదిలీ చేయనున్నారు. అప్పటి వరకు కూడా జీతాలు రావని అధికారులు చెప్పినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు.

బంగారం క్యారెట్ల విలువ!

మీకు తెలుసా..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బంగారం కొనుగోలు చేసే ముందు వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా బంగారం నాణ్యతను గుర్తించి మోసాలకు చెక్ పెట్టొచ్చు. బంగారం స్వచ్ఛతను క్యారెట్ల రూపంలో కొలుస్తారు. 99.9 శాతం స్వచ్ఛత ఉన్న బంగారాన్ని 24 క్యారెట్ల బంగారం అంటారు. దీనితో ఆభరణాలు చేయరు. ఇది బిస్కెట్ రూపంలోనే ఉంటుంది.

- 22 క్యారెట్లు: 91.6 శాతం బంగారం, మిగతా 8.4 శాతం ఇతర లోహాలు కలుస్తాయి.
- 18 క్యారెట్లు: 75 శాతం బంగారం, మిగతా 25 శాతం ఇతర లోహాలు
- 14 క్యారెట్లు: 58.5శాతం బంగారం, మిగతా భాగం ఇతర లోహాలు
- 12క్యారెట్లు: 50 శాతం మాత్రమే బంగారం, మిగతా 50 శాతం ఇతర లోహాలు మిశ్రమంతో తయారీ అవుతుంది.
- 10 క్యారెట్లు: 41.7 శాతం బంగారం మాత్రమే ఉంటుంది.
- బంగారం ఆభరణాలు తయారీలో కాడ్మియంతో సోల్డరింగ్ చేయడాన్ని కేడీఎం అంటారు. ఇవి 91.6 నాణ్యతతో ఉంటాయి.
- ఆభరణం చిన్నదైనా, పెద్దదైనా హాల్‌మార్క్ ముద్ర, నాణ్యత శాతాన్ని సూచించే నంబర్ తోపాటు ఆ వస్తువు సర్టిపై చేసిన హాల్‌మార్క్ సెంటర్ వివరాలు తెలిపే హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ యూనిక్ ఐడీ నంబరు విధిగా ఉండాలి.
- ఈ అన్ని వివరాలను కొనుగోలు రశీదులో పొందుపర్చి వినియోగదారుడికి అందించాల్సి ఉంటుంది.

మీ డిజి పిన్ తెలుసుకోండి?

సమాచారం..



ఖలీల్‌వాడి: మనం సాధారణంగా అడ్రస్ తెలిపేటప్పుడు పోస్ట్‌కార్డు లేదా దరఖాస్తులు ఇతర వాటిపైన ఖచ్చితంగా పిన్‌కోడ్ నెంబర్‌ను రాస్తాం. అయినప్పటికి ఖచ్చితమైన అడ్రస్‌ను ఎక్కడ ఉన్నది కొన్ని సందర్భాల్లో కనుక్కోవడం కష్టంగా అవుతుంది.

- దీనిని అధిగమించడానికి పది అంకెల ఆల్ఫా న్యూమరిక్ డిజి పిన్‌ను పోస్టల్ శాఖ(తపాలా శాఖ) అందుబాటులోకి తీసువచ్చింది.
- పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక శాఖ వంటి సేవలతోపాటు ఆన్‌లైన్ ఆర్డర్ల డెలివరీల కోసం ఈ డిజిపిన్ ఉపయోగిస్తున్నారు.
- సాధారణ పోస్టల్ చిరునామా ప్రాంతం, వీధి, ఇంటి సంఖ్యలపై ఆధారపడి ఉంటుంది. కానీ DIGIPIN అనేది ఒక స్థానం యొక్క ఖచ్చితమైన కోఆర్డినేట్‌ల ఆధారంగా 10–అక్షరాల ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌ను ఉపయోగించే జియోస్పేషియల్ రిఫరెన్స్.
- DIGIPIN చిరునామా నిర్వహణను సులభతరం చేస్తుంది. ముఖ్యంగా నిర్మాణాత్మకంగా లేని లేదా మారుతున్న చిరునామాలు ఉన్న ప్రాంతాలలో ఖచ్చితమైన స్థానం, ఆధారిత గుర్తింపును అందిస్తుంది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలు, అడవులు, మహాసముద్రాలు వంటి స్పష్టమైన చిరునామా లేని ప్రాంతాలలో కూడా ఇది సహాయపడుతుంది.

డిజిపిన్ జనరేట్ చేసుకోండి..

- మొదట పోస్టల్ వెబ్‌సెట్‌లోకి వెళ్లి అందులో కనిపించే నో యువర్ పిన్‌కోడ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- తర్వాత 'నో యువర్ డిజిపిన్'పై క్లిక్ చేయాలి. లొకేషన్ యాక్సెక్ పాస్‌ఆప్‌లో ఆప్షన్ ఎంటర్ చేయాలి.
- అనంతరం స్క్రీన్ పైన కుడి వైపున ఆంగ్ల అక్షరాలు, అంకెలతో కూడిన పదంకెల డిజి పిన్ కనిపిస్తుంది.
- లేదా డిజిపిన్ కోసం తపాలా శాఖ ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన వెబ్‌సైట్‌లోని లింక్‌పై క్లిక్ చేయగానే మీరు ఉన్న లొకేషన్ డిజి పిన్ కనిపిస్తుంది.

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు



కాలూర్ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించిన వరి పైరు

రుద్రూర్: జిల్లాలోని వివిధ మండలాల్లో రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించి వరి పంటకు బాక్టీరియా ఎండాకు తెగులు, కాండం తొలుచు పురుగు ఉధృతి ఉన్నట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా తెగుళ్ల ఆశించడానికి కారణాలు, యాజమాన్య చర్యలను వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త సమతా పరమేశ్వరి వివరించారు.

కారణాలు:

- జిల్లాలో సాగు చేస్తున్న వరి రకాలు తెగులు తట్టుకోలేకపోవడం. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అధిక వర్షాలు కురవడం వల్ల ఈ తెగులు ఉధృతి అధికంగా ఉంది.
- బ్యాక్టీరియా ఎండాకు తెగులు దుబ్బు చేసే దశ నుంచి చిరు పొట్ట దశలో ఉన్న వరి పంటను ఆశించే అవకాశం ఉంది.
- ఈ తెగులు ఆశించినప్పుడు ఆకుల మీద అంచుల వెంబడి అలల మాదిరిగా నీటి రంగు డాగు మచ్చలు ఏర్పడతాయి. ఆకుల అంచుల వెంబడి కొన నుంచి కింది భాగం వరకు వ్యాప్తి చెంది ఆకులు ఎండి పోతాయి.
- దుబ్బు చేసే దశ నుంచి చిరుపొట్ట దశలో ఈ ఆకులు ఎండిపోవడం వల్ల దిగుబడిపైన ప్రభావం చూపుతుంది.
- ఈ తెగులు ఆశించిన మొక్కలను గమనిస్తే వాటి ఆకుల వెంబడి బ్యాక్టీరియాకు సంబంధించిన జిగురు ఉండలు ఉదయం వేళలో కనిపిస్తాయి. ఇది ఒక మొక్క నుంచి మరొక మొక్కకి లేదా ఇంకొక పొలంలోకి నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- పంట నీటి ముంపునకు గురయినపుడు ఎండాకు తెగులు ఉధృతి ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ తెగులు చూడడానికి పోషక లోపంలాగా కనిపిస్తునందున రైతులు గుర్తించడానికి ఇబ్బంది పడుతారు.

యాజమాన్య చర్యలు..

- తొలిదశలో గుర్తిస్తే తెగులు నివారించడానికి రాగిదాతు శిలీంద్ర నాశనం అయిన కాపర్ హైడ్రాక్సైడ్ మందును ఒక లీటర్ నీటికి రెండు గ్రాములు వాడాలి. లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములుతోపాటుగా స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్ లేదా ప్లాంటో మైసిన్ అనే బ్యాక్టీరియా శిలీంద్ర నాశిని 0.4 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి.
- వరి పంట పూత దశలో ఉన్నప్పుడు బ్యాక్టీరియా తెగులు లక్షణాలు గమనిస్తే ఈ రాగిదాతు శిలీంద్ర నాశనులను పిచికారీ చేయవద్దు. చిరు పొట్ట దశలో ఈ తెగులు తట్టుకునే శక్తిని పెంపొందించడానికి మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎకరానికి 15 నుంచి 20 కేజీలు వేసుకుంటే బ్యాక్టీరియా లక్షణాలు తట్టుకునే శక్తిని కూడా మొక్క గ్రహిస్తుంది.
- కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పి 2 గ్రాములు వాడాలి. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 18.5 ఎస్.సి 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- రైతులు సరైన సమయంలో చీడపీడలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు.

స్కూల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థి

- తండ్రి మందలిస్తాడనే భయమే కారణం
- ఘటనపై విచారించిన డీఈవో

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల భవనం పైనుంచి విద్యార్థి దూకిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి శుక్రవారం నిర్వహించిన పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడుతూ టీచర్‌కు పట్టుబడగా వెంటనే అతడి తండ్రికి సమాచారం అందించారు. తన తండ్రి ఎక్కడ మందలిస్తాడోననే భయంతో విద్యార్థి పాఠశాల భవనం పైనుంచి దూకగా సిబ్బంది హుటాహుటిన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న తండ్రి తన కొడుకు పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడినట్లు తనకు తెలుపడంతో భయంతో భవనం పైనుంచి దూకాడన్నారు. ఈ ఘటనపై నాల్గోటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. తండ్రి మందలిస్తాడనే భయంతోనే విద్యార్థి భవనం పైనుంచి దూకాడన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆస్పత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడడంతో పాటు సీసీ ఫుటేజీని పరిశీలించారు. తన తండ్రి మందలిస్తాడనే భయంతోనే భవనం పైనుంచి తాను దూకినట్లు విద్యార్థి తెలిపాడని డీఈవో అన్నారు. ఈ ఘటనలో పాఠశాల యాజమాన్యం తప్పేమీ లేదని స్పష్టం చేశారు.

రూ.కోటిన్నరతో వ్యాపారి పరారీ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో ఓ బంగారం దుకాణదారుడు సుమారు రూ.కోటి యాభైలక్షలతో పరారీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం పోలీస్ స్టేషన్ సమీపంలో గత కొంతకాలంగా ఓ వ్యక్తి బంగారు ఆభరణాల దుకాణం నిర్వహించేవాడు. బంగారం ధర పెరగడంతో చేసే వ్యాపారంలో నష్టపోయి, చిట్టీలు లేపి, అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని వ్యాపారం నిర్వహించాడు. దీంతో నష్టాలకు గురికావడంతో ఉన్న డబ్బు, బంగారంతో పరార్ అయ్యాడు. వ్యాపారీ పరార్ కావడంతో ఆభరణాల తయారీ కోసం బంగారం ఇచ్చిన మహిళలు, డబ్బులు ఇచ్చిన చీటీల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోపాల్: మండలంలోని కంజర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ వైద్యుడు మృతిచెందాడు. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాలు ఇలా..నర్సింగ్‌పల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు వెల్దుర్తి గంగాధర్ (53) శనివారం అర్ధరాత్రి నర్సింగ్‌పల్లి నుంచి మోపాల్ వైపు బైక్‌పై బయలుదేరాడు. కంజర్ రెసిడెన్సియల్ స్కూల్ ఎదుట మలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లాడు. ఈవిషయాన్ని రెసిడెన్సియల్ స్కూల్ వాచ్‌మెన్ గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులుఘటనాస్థలానికి చేసుకుని గంగాధర్‌ను పరీక్షించారు. అప్పటికే మృతిచెందగా, కుటుంబీలకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వివాహిత ..



భవాని(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై భార్గవ్‌గౌడ్ వివరాలు ఇలా.. నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి కమలాకర్‌కు, మెదక్‌కు చెందిన భవాని(22)కి కొన్ని నెలల క్రితం వివాహం జరిగింది. గత ఆరునెలలుగా దంపతుల మధ్య విభేధాలు తలెత్తడంతో ఇటీవల కుటుంబసభ్యులు జోక్యం చేసుకొని ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు. ఈక్రమంలో ఈనెల 16న భవాని పొలానికి వెళ్లి అక్కడ గుర్తుతెలియని విషపదార్థం తాగి, అపస్మారకస్థితిలో పడిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను నిజామాబాద్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా 19న చికిత్సపొందుతూ ఆమె మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు..



రాంరెడ్డి (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని నందివాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ రాంరెడ్డి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మూడు రోజుల క్రితం రాంరెడ్డి అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడన్నారు. రాంరెడ్డి గతంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సతీమణి నందివాడ సర్పంచ్‌గా పనిచేసింది.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఏఎస్సై ప్రకాశ్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కామారెడ్డి పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.6,190 నగదు, ఐదు బైక్‌లు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

హోన్నాజీపేట్‌లో ఒకరి ఆత్మహత్య

ధర్పల్లి: మండలంలోని హోన్నాజీపేట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కళ్యాణి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సురేష్(40) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పులు చేసి వైద్యం చేయించుకున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై న్యూసెన్స్ కేసు నమోదు

నవీపేట: నిజామాబాద్ నుంచి నవీపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఆదివారం మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. నిర్మల్ జిల్లాలోని కేడీ గ్రామానికి చెందిన బడే రామ్ తాగిన మైకంలో మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిల ఫిర్యాదు మేరకు అతడిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దాడి కేసులో ఒకరిపై..

మోపాల్: మండలంలోని తాడెం గ్రామానికి చెందిన లింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుస్మిత ఆదివారం తెలిపారు. తాడెం సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న చెంచెట్టి రవీందర్‌కు, గ్రామంలోని లింగంకు ఎల్‌సీ విషయంలో ఇటీవల వాగ్వాదం నెలకొంది. దీంతో రవీందర్ విధులకు లింగం ఆటంకం కల్గించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ భౌతికదాడికి పాల్పడ్డాడు. రవీందర్ ఫిర్యాదు మేరకు లింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన ముగ్గురిపై ఆదివారం గోవధ నిషేధచట్టం కింద కేసునమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన ఎండీ పాషతోపాటు అతని కుమారులు ఫిరోజ్, అఫ్రోజ్‌లు గ్రామంలో ఆవును కోసి మాంసం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఎండీ పాషతోపాటు ఫిరోజ్, అఫ్రోజ్‌లపై గోవధ నిషేధచట్టం కింద కేసునమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఆర్మూర్ టౌన్: మండలంలోని అంకాపూర్ గ్రామపంచాయతీ సమీపంలో ఆదివారం విజిలెన్స్ అధికారులు, ఆర్మూర్ పోలీసులు సంయుక్తంగా కలిసి రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. లారీలో 250 బస్తాల్లో ఉన్న బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యంను తరలిస్తున్న అంజి, మహేందర్, రాజయ్య, నరేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేల్పూర్: మండలంలోని రామన్నపేట్‌లో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం అర్ధరాత్రి గ్రామస్తులు పట్టుకొని మోర్తాడ్ పోలీసులకు అప్పగించారు. గ్రామస్తు లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వాగు నుంచి కొందరు వ్యక్తులు రాత్రిపూట ఇసుకను అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నారని గుర్తించి నిఘా పెట్టామన్నారు. గ్రామం నుంచి జాగిర్యాల్ రోడ్డు వైపు ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నామన్నారు. వెంటనే మోర్తాడ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు.

పోతంగల్‌లో ఒకరి అదృశ్యం

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రానికి చెందిన గంగం మహేందర్(45) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. ఈమేరకు మహేందర్ తండ్రి నీలకంఠం ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

మోపాల్: ఓ వ్యక్తి అదృశ్యమై మండలంలోని న్యాల్‌కల్ చెరువులో శవమై తేలాడు. ఎస్ఐ సుస్మిత తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని పాటిగల్లికి చెందిన ఓదెల అనిల్ కుమార్ యాదవ్ (41) గోల్డ్ షాప్‌లో పని చేస్తున్నాడు. శనివారం వ్యక్తిగత పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు నాలుగో టౌన్‌లో మిస్సింగ్ కేసు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం చెరువులో వ్యక్తి మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు.మృతుడు అనిల్‌కుమార్‌గా గుర్తించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.